భోజారెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ఆదిలాబాద్ రూరల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 : మాజీ మంత్రి జోగు రామన్న ప్రధాన అనుచరుడిగా, కుటుంబంలో ఒకరిగా మెలిగిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరి ఆయనపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో పలువురు కౌన్సిలర్లు, నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఓటమిలో ఉన్న వ్యక్తికి అండగా నిలవాల్సింది పోయి మరింత బాధపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో జోగు రామన్నపై వచ్చిన ఆరోపణలు తిప్పికొట్టిన భోజారెడ్డి ప్రస్తుతం ఆయనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు అశోక్ స్వామి, సంద నర్సింగ్, పండ్ల శ్రీనివాస్, వెంకన్న, ధర్మపాల్, రామ్ కుమార్, కొండ గణేశ్, లక్ష్మణ్, ఇమ్రాన్, విషు పాల్గొన్నారు.

జైనథ్(బేల), జనవరి 18: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాజీ మంత్రి జోగు రామన్న గురించి మాట్లాడడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి అన్నారు. గురువారం బేలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలు జోగు రామన్న వెంట ఉండి ఇప్పుడు అతనిపై అడ్డి భోజారెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు ఇంద్రశేఖర్, విపిన్ ఖోడే, చరణ్ సింగ్, నాయకులు గంభీర్ ఠాక్రే, మంగేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

జైనథ్: మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి

పిల్లలతో పని చేయిస్తే చర్యలు

- సహాయ కార్మిక అధికారి గోవర్ధన్
- దంతన్‌పల్లి, శివగూడ గ్రామాల్లో ఇటుక బట్టీ తయారు కేంద్రాలు తనిఖీ

మాట్లాడుతున్న సహాయ కార్మిక అధికారి గోవర్ధన్

ఉట్నూర్ రూరల్, జనవరి 18 : 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ కార్మిక అధికారి గోవర్ధన్ అన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం దంతన్‌పల్లి, శివగూడ గ్రామాల్లోని ఇటుక బట్టీల తయారు కేంద్రాలను పోలీసులు, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుక బట్టీలో పని చేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, కార్మికుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని యజమాని పని చేయించాలని సూచించారు. కార్మికులకు తక్కువ వేతనం, అధిక పని భారం, ఎక్కువ సమయం పని చేయించ కూడదని అన్నారు. ప్రతి కార్మికుడు ఈ శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుంటే సంవత్సర కాలంలో ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. యజమానులు కార్మిక నిబంధనలు పాటించనిచో 4 నెలల జైలు, రూ.20 వేల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు అశోక్, సుగుణ, చైల్డ్ ప్రొటక్షన్ అధికారి రవికాంత్, శ్రీకాంత్, సిబ్బంది గంగన్న, సుభాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 : ప్రభుత్వ ఏర్పడిన నెల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తన నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఆరోపించారు. జగిత్యాల జిల్లాలో నిరాశ్రయులైన గుడిసె వాసులను పోలీసులు నిర్బంధంగా తొలగించడాన్ని ఖండిస్తూ జిల్లా కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వ వైఖరిని ఖండించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, ప్రజపంథా నాయకులు జగన్ సింగ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్న మొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న, ఆర్ సురేందర్, ఆర్ మంజుల, జిల్లా నాయకులు స్వామి, లింగాల చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 : ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామానికి చెందిన జక్కుల స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, ప్రశాంత్ రెడ్డి, గంగారెడ్డి ఉన్నారు.

ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు

ఎస్పీని సన్మానిస్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు

ఎదులాపురం, జనవరి 18 : ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్పీ గౌస్ ఆలంను గురువారం క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఇక్కడ మజర్, అజార్, అవిజ్ ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి, ప్రిన్సిపాల్స్

ఎదులాపురం, జనవరి 18 : 2024–25 విద్యా సంవత్సరానికి గానూ మైనార్టీ గురుకులాలు, కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాథోడ్ రమేశ్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో విద్యాసంస్థలో ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు మైనార్టీ గురుకులాలు, కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఐదో తరగతికి 280 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 240 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో బాలుర 2, బాలికలు 2, ఉట్నూర్‌లో బాలుర, బోథ్‌లో బాలికల గురుకుల పాఠశాలు ఉన్నాయని అన్నారు. అలాగే వివిధ తరగతిలో మిగిలిపోయిన సీట్లు 110 ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. tmreis telanagana.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాని సూచించారు. అలాగే సమీప గురుకుల పాఠశాల, కళాశాలలో దరఖాస్తు ఇవ్వవచ్చన్నారు. ఐదో తరగతిలో మైనార్టీ బాలుర కోసం 200 సీట్లు కేటాయించగా ఇందులో మైనార్టీలకు 150, నాన్‌మైనార్టీలకు 50 సీట్లు, మైనార్టీ బాలికల కోసం 80 సీట్లు కేటాయించగా మైనార్టీలకు 60 నాన్‌మైనార్టీలకు 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఆర్‌సీఎల్ రుహీద్ అహ్మద్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 18: సిరికొండ నుంచి ఇచ్చోడకు రోడ్డుపై వాహనదారుల స్పీడ్ తగ్గించుకునేందుకు ప్రాథమిక, ఉన్నత పాఠశాల వద్ద యువసేన ఆధ్వర్యంలో గురువారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, పాఠశాల సిబ్బంది యువసేన ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీల్, జైతు, యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, మాజీ సర్పంచ్ పెంటన్న, అశోక్, మల్లేశ్, సాయికృష్ణ, ప్రవీణ్, దత్తు, మహేశ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న యువసేన సభ్యులు

పాత రహదారి గుండా విస్తీరణ పెంచాలి

నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

జైనథ్(బేల), జనవరి 18 : నాలుగు వరుసల రహదారి విస్తీరణ తమ పంట పొలాల నుంచి కాకుండా పాత రహదారి గుండా పెంచాలని కోరుతూ బేలలోని తహసీల్ కార్యాలయం ఎదుట రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గురువారం వారికి బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులతో చేతులు కలిపి కొందరు రైతుల పంట పొలాల నుంచి నాలుగుల వరుస రహదారి మంజూరు చేయించారు. భూమి కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఏ మాత్రం న్యాయంగా ఉండదని, వారికున్న ఎకరం, రెండు ఎకరాలు భూమి పోతే వారు, వారి పిల్లలు రోడ్డు మీద పడతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి కేవలం 7 కిలో మీటర్లు విస్తరిస్తున్నారు కాబట్టి పాత రహదారి గుండానే విస్తరించాలని డిమాండ్ చేశారు. కాదని రైతులకు అన్యాయం చేస్తే ఉద్యమం చేయడానికి వెనకాడమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనితాఠాక్రే, సైద్‌పూర్, సాంగ్వి, సదల్‌పూర్, ఎంపీటీసీలు యమునబాయి, కుంట రాకేశ్, కొడప అరుణ్, సర్పంచ్‌లు ఇంద్రశేఖర్, విపిన్ ఖోడే, నాయకులు గంభీర్ ఠాక్రే, మంగేశ్ ఠాక్రే పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు రైతులు సహకరించాలి

బోథ్, జనవరి 18 : బోథ్ మార్కెట్ పరిధిలోని పొచ్చర, నేరడిగొండ, సోనాల, బోథ్ సీసీఐ కేంద్రాల పరిధిలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లకు రైతులు సహకరించాలని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఎంఈసీహెచ్ ఎంవోడీ ధర క్వింటాల్‌కు రూ.6920 తో సీసీఐ వారు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 : జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ గురువారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు మనోజ్ తెలిపారు.

పత్తి క్వింటాల్‌కు రూ.6970

ఎదులాపురం, జనవరి 18 : పత్తి యొక్క ప్రధాన పొడువు నాణ్యత రావడం లేనందున వస్త్ర పరిశ్రమ భారత ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం పత్తి కొనుగోలు చేస్తామని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ నెల 22 తేదీ నుంచి నాణ్యత ప్రమాణాల కింద పత్తి క్వింటాల్‌కు రూ.6970కు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలన్నారు.

సేద్వాయిలో వైద్య శిబిరం

నార్నూర్,జనవరి 18 : ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ నాయమహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గాదిగూడ మండలం సేద్వాయి గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గాదిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో పవార్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రతిమ, ల్యాబ్ టెక్నీషియన్ గంగాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 : ఆదిలాబాద్ న్యూ హౌజింగ్ బోర్డు పరిధిలోని సర్వే నంబర్ 161/ఏలో మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ హర్పాత్, ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ రాహుల్, కాంగ్రెస్ పార్టీ మావల మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు ఉన్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర

ఇంద్రవెల్లి, జనవరి 18 : మండల కేంద్రానికి చెందిన గోండ్ గూడ ఆదివాసీ గిరిజనులతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు అయోధ్య రాములోరి కలశం, అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ, జనవరి 18 : విద్యార్థులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ నరేశ్ అన్నారు. గురువారం కేశవపట్నం గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ ఉర్దూ మీడియం పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో డాక్టర్ నరేశ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రోజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేత

బజార్‌హత్నూర్, జనవరి 18: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కం శంకర్ గురువారం ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యకు రూ. 10 వేలు విరాళం అందజేశారు. విరాళం అందజేసిన ఉపాధ్యాయుడిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పోషకులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గాండ్ల రమేశ్, గ్రామస్తులు కొత్త శంకర్ పాల్గొన్నారు.

లోకోస్ డాటా ఎంట్రీని పూర్తి చేయాలి

జైనథ్, జనవరి 18 : స్వయం సహాయక సంఘాల సభ్యుల వివరాలు లోకోస్ డాటాలో ఎంట్రీ పూర్తి చేయాలని ఐకేపీ, డీఆర్‌డీఏ, డీపీఎం హేమలత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకోస్‌తో పాటు బీఆర్ఎస్ డాటాను సైతం రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రెండు డాటాను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లయితే స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు వస్తాయన్నారు. సమావేశంలో ఏపీఎం భగవాండ్లు, సీబీవో ఆడిటర్ శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, జనవరి 18 : ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్రపరిశీలన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు, పీఎం జన్‌మన్ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు ప్రక్రియ పూర్తయినందున క్షేత్ర పరిశీలనకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా దరఖాస్తుల క్షేత్ర పరిశీలన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు లేని వారికి తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయించాలని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 15న ప్రారంభించిన పీఎం జన్‌మన్ పథకం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా పీవీటీజీ కుటుంబాలను గుర్తించి పథకంపై వివరించి ఆధార్, ఓటరు, కుల ధృవీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మహిళ శిశు సంక్షేమ శాఖపై కలెక్టర్ సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ పౌష్టికాహారం అందించాలన్నారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సామ్ మామ్‌పై నిరంతం పర్యవేక్షించాలని సీడీపీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో కిషన్, జడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ శైలజ, డీడీ దిలీప్ కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ, జనవరి 18 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏడీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. 57 దరఖాస్తులు వచ్చాయని, అందులో నాలుగు అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. 2021లో పది మంది రైతులు రూ.52 వేలు కట్టడం జరిగిందని, కానీ ఇంత వరకు స్తంభాలు వేయలేదని ముక్రా(బీ) సర్పంచ్ మారుతి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణ, కిషన్, రైతులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

జైనథ్, జనవరి 18: రైతులు యాసంగి పంటల వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వివేక్‌కుమార్ సూచించారు. పంటల వివకాల నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం సిర్సన్న గ్రామంలోని శనగ పంటలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం ఊశన్న, భోరజ్ క్లస్టర్ వ్యవసాయ విస్తీరణాధికారి రమణ, రైతులు పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి కృషి చేస్తా

తాంసి(తలమడుగు), జనవరి 18 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా వంటశాల నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీడీవో తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, వంటశాల, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న మన బడి తోటను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న వంట షెడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, పీఈటీ మమత, పంచాయతీ అధికారులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాంసి, జనవరి 18 : కిడ్నీ సమస్యతో బాధపడుతూ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పొన్నారి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పొన్నారి గ్రామానికి చెందిన ఎస్‌కె ధాదు (30) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో నొప్పి భరించలేక బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి అతడిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాం తెలిపారు.

ఉదారతను చాటుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎదులాపురం, జనవరి 18 : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉదారత చాటారు. తోటి ఉద్యోగి అయిన కార్పెంటర్ రాంజీ ఇటీవల పక్షవాతంతో బాధపడుతుండగా రూ.52,700 ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ చేతుల మీదుగా ఉద్యోగి రాంజీ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ విజయ, ఆఫీస్ సూపరింటెండెంట్లు మహేందర్, గోపి, రిమ్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీను, సభ్యులు మల్లయ్య, తిరుపతి, రవి, రాజు, సంతోష్, రిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, జనవరి 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు గ్రూపు– 1,2,3,4 ఫౌండేషన్ కోర్సులకు ఇచ్చే ఉచిత కోచింగ్‌కు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీబీసీడీవో రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. స్టడీ మెటీరియల్‌కు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 08732 221280 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

గుడిహత్నూర్, జనవరి 18 : గుడిహత్నూర్ మండలం సీతాగోంది గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు.. గుడిహత్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్ బోరుబండి వెళ్తుండగా సీతాగోంది గ్రామ సమీపంలో వెనుక నుంచి కంటైనర్ ఢీ కొనడంతో బోరుబండి జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు కింద ఇరుక్కున్నారు. వారిని క్రేన్ సహాయంతో బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. అలాగే కంటైనర్ ముందు భాగంలోని క్యాబిన్‌లో ఒకరు ఇరుక్కుపోగా ఆయనను కూడా స్థానికుల బయటకు తీశారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. జాతీయ రహదారిపై బోరు బండి బోల్తాపడిపోవడంతో రెండున్నర గంటలు ట్రాఫిక్ జామ్ అయింది. క్రేన్‌తో పడిపోయిన బోరు బండిని ప్రక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఎరువుల కొనుగోలుకు రసీదులు ఇవ్వాలి

బోథ్, జనవరి 18 : ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందుల విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని బోథ్ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అధికారి శ్రీధర్ స్వామి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లైసెన్స్ పొందిన దుకాణదారులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నిబంధన మేరకు రైతులకు ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలన్నారు. దుకాణాల్లోని నిలువలను ధరల పట్టిక బోర్డుపై ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర, బోథ్, పొచ్చర, ధన్నూర్(బీ), కౌఠ(బీ), సోనాల గ్రామాలకు చెందిన దుకాణాదారులు పాల్గొన్నారు.

మహదేవ్ జాతర ప్రారంభం

ఉట్నూర్ రూరల్, జనవరి 18: సాలేవాడ(కే) గ్రామంలో హర హర మహదేవ్ ఆలయ జాతర ప్రారంభమైంది. బుధవారం రాత్రి పూజలు నిర్వహించిన అనంతరం గురువారం నుంచి జాతర ప్రారంభమైంది. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సల్గర్ రవీందర్ తెలిపారు.

జైశ్రీరాం సీడీ విడుదల

ఉట్నూర్, జనవరి 18: అయోధ్యలో రామ విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ఉట్నూర్ కవులు బంకట్‌లాల్, ఇందల్ సింగ్‌లు జైశ్రీరాం పాటను రూపొందించారు. గురువారం ఈ పాట సీడీని స్థానిక శ్రీసాయిగురుదత్త మందిరంలో విడుదల చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేతగా ఆదిలాబాద్ బాలుర జట్టు



గెలుపొందిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 18: 67వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ 14 సంవత్సరాల విభాగం సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకొని బహుమతిని అందుకుంది. మొదటి నుంచి దూకుడుగా ఆడి విన్నర్‌గా నిలిచిన బాలుర జట్టు సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన హోరాహోరి ఫైనల్‌లో మెదక్ జట్టును 3–1 తేడాతో ఓడించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు జట్టు కోచ్ మేనేజర్లు యాదగిరి, స్వామి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం పొందడంపై జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, పెటా అధ్యక్షుడు పార్థసారథి అభినందించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ, జనవరి 18: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైష్ణవ సదన్ నారాయణ మహారాజ్ అన్నారు. గురువారం మాదాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పట్వారిగూడ రామాలయ ఆవరణలో విఠల్ మహారాజ్ సాండూల్కర్ పుణ్యతిథి పురస్కరించుకొని నారాయణ మహారాజ్ కీర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677